# జ్యోత్స్నాభిసారిక

## నృ త్య నా టి క

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

**NRUTYANATIKALU**

(A collection of Two Dramas)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,

రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్

హైదరాబాద్ -500084.

Cell -9440495887.

Web Site : can down load digital copies at

nanduri.co.in

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# జ్యో త్స్నా భి సా రి క

## నృ త్య నా టి క

భూమికలు

రాధ

రాగిణి

శ్రీకృష్ణుడు (మూకాభినయము)

# జ్యోత్స్నాభిసారిక

బృందావనం : యమునాతీరం

ప్రవేశం రాధ

రాగమాలిక - ఆది : నాట

కల గనుచున్నద హెూ !...
తియ్యని కల గనుచున్నద హెూ !
అలలే కలలై కలలే అలలై
జలజల పారే అల యమునానది
కల గనుచున్నద హెూ ...

అద్దమ రాతిరి నిద్దుర మైకము
వన్నెల చిన్నెల పున్నమి వెన్నెల
పులకింపులతో తులకింపులతో
గలగల పారే అల యమునానది
కలగనుచున్నద హెూ !
తియ్యని కల గనుచున్నద హెూ !...

బేగడ

అందము చిందుచు అభిసారికయై
విరహిణి రాధిక విహరించె నహెూ !
'సుందర సురభిళ బృందావనిలో
విరహిణి రాధిక విహరించెన హెూ || కల ||

ఆభోగి

మాధవ మృదుమధురాధర రంజిత
మంజుల మురళీ కలరవ గుంజిత

సుందర సురభిళ బృందావనిలో
విరహిణి రాధిక విహరించెన హెూ !                    || కల ||

మాండు

డెందము నందలి తహతహతో
కందువ లందలి తళతళతో
ఎందుకు రాధా 'ఇటు లీ తొందర !
అందెల సందడి చిందర వందర !                    || కల ||

హిందోళ

విరహిణి రాధిక వెన్నెల వేడికి
తాళక తడబడు అడుగుల నడువగ
జడలో పువ్వులు ముసిముసి నవ్వులు
విసవిస విసరెను బృందావనిలో                    || కల ||

కన్నడ

కెందలిరాకుల క్రొందెర చాటున
గుసగుస లాడెను గువ్వల జంటలు
చిరు కెరటమ్ముల చెవిలో చెప్పెను
మందానిల మీ మధుర రహస్యము
కల గనుచున్నద హెూ !....
తియ్యని కల గనుచున్న దహెూ !
వన్నెల చిన్నెల పున్నమి వెన్నెల
అద్దము రాతిరి నిద్దుర మైకము
జిలిబిలి తలపులు తొలకరి వలపుల
అలలే కలలై అల బృందావని                    || కల ||

ఆది : దర్బారు

సాగ సాగవె ఓ అభిసారిక !

వేగమె తీరును తియ్యని కోరిక!

జిగిబిగి వలపుల తెగువరి తెరువరి !

జిలిబిలి నగవుల గడుసరి సొగసరి! || సాగవె ||

చల్లని వెన్నెల తెల్లని పువ్వులు

గమగమ వలచెడు కమ్మని తెమ్మెర || సాగవె ||

సారంగ

పడమటికొండల బంగరు మబ్బుల

స్యందన మెక్కిన సంధ్యాసుందరి

తారాతోరణ తరళద్వారము

చేరెను సొగసులు చింద నొయారము || సాగవె ||

కేదార గౌళ

ధగధగ లాడగ దుద్దుల రవ్వలు

గుమగుమ లాడగ క్రొమ్ముడి పువ్వులు

తళతళ లాడెడి తెలి గన్నులతో

ఝుళఝుళ మ్రోసెడి చిరుగజ్జెలతో || సాగవె ||

ఆది : ఆనంది భైరవి

ఆగవే ఆగవే ఓ అభిసారిక!

వేగమె తీరునే తీరని కోరిక !

మెరుపులు మెరిసెను

ఉరుములు ఉరిమెను

చిటపొటి చినుకులు చిరుబడి కురిసెను

తొలకరి మబ్బుల తునకల దొంతర

ఆకసమున పెనుచీకటి చిమ్మెను || ఆగవె ||

కరమను రాగము గాఢ తమస్విని
తరలకు ముందుకు తరళ వయస్విని !
మరలుము వెనుకకు మధుర మనస్విని !
పరవశ మేటికె  ప్రణయ తపస్విని !                    ॥ ఆగవె ॥

ఆది : బేహాగ్

చదలున మబ్బులు చెదరెను తృటిలో
వెన్నెల వెలుగులు వెల్లువ విరిసెను
చుక్కల నగిషి చెక్కిన పందిరి
నింగిని అందపు నీలిమ చిందెడి                    ॥ సాగవె ॥

మవ్వపు వెన్నెల మైదానములో
చిరుకౌగిలిలో చిక్కిన చెలువుని
చక్కని ముక్కవు అక్కున చేర్చుచు
గ్రక్కున ఉక్కిరి బిక్కిరి సేయగ
సాగవె సాగవె ఓ అభిసారిక!
వేగమె తీరును తియ్యని కోరిక!
జిగిబిగి వలపుల తెగువరి తెరువరి !
జిలిబిలి నగవుల గడుసరి సొగసరి !

రాధ పునఃప్రవేశం

కానడ : ఆది

రాధనురా మురళీ ధర !
మరచిన చిరగాధనురా మాధవ !
మధురాపురి దేవేరిని గానుర,
ఎదలోపల మెదిలే బాధనురా                    ॥రాధనురా ||
ఊదకు ఊదకు వేణువు కృష్ణా !
ఊదుచు నాయెద ఉయ్యెలలూగకు

నితశతపత్రాంచిత నేత్రాంచల!
క్షణచంచల కాంచన చేలాంచల !　　||రాధనురా||

కాఫీ

పూబొదరిండ్లను దాగకు కృష్ణా!
దాగుచు దాగుడు మూతలు ఆడకు
కేళీశ్రితశిఖిపింఛాభరణా !
లీలాతాండవ నిక్వణచరణా !　　||రాధనురా||

విడువుము విడువుము వాల్జడ కృష్ణా !
జడలో పొగడలు ముడువకు కృష్ణా !
శ్యామల కోమల చారుశరీరా !
మంజుల యమునాకుంజవిహారా !　　||రాధనురా||

రాధ నిష్క్రమణము

రాగిణి ప్రవేశము

యమన్ కల్యాణి: రూపక

నవనవ లాడెడి లే
జవరాలనురా ! మురళీధర !
నిలువగ జాలక జలజల
పారెడి సెలయేరును రా !　　||నవనమ||

ఎండ కన్ను ఎరుగకుండ
తలిరాకుల తల దూరిచి
బుగ్గలు కగ్గని సిగ్గుల
మొగ్గనురా మురళీధర !　　||నవనమ||

నవరస : కన్నడ

వగలమారి వయ్యారము
సొగసులూరు నయగారము
చిలిపిసిగ్గు సింగారము
కలికిచూపు కైవారము
చవి యెరుగని దాననురా
రుచి మరగని దాననురా! ||నవనమ||

హుసేని

తలపు పాల కడలి చిలికి
వలపు వెన్న ముద్ద చేసి
నిండు గుండె వెండికుండ
కోరికోరి కూర్చినాను
ఆరగింపరార చేరి
కోడెవయసు సొగసుకాడ ! - ||నవనమ||

రాగిణి, రాధ ప్రవేశము : ఎదురుబొదురుగా

రాగిణి

శంకరాభరణం

నడికిరేయి, కాల్నడక, బృందావనమ్ము
చేరకతమేమి ? అమ్మకచెల్ల! చెలియ ?
ఓరగనుల, కాదారి మాదారి దాటి
తరిపి వెన్నెల పచ్చిముత్యాల త్రోవ.

రాధ

ఆనంద భైరవి

తెల్లని చీర గట్టి, వెలదీ ! జడ మల్లెలచెండు వెట్టి ప్రే
పల్లెను వీడినావు ; వలవంతలు, చల్లని పిల్లతెమ్మెరల్,
పిల్లనగ్రోవిమోవి, కనువేదురు, వెన్నెలపాలవెల్లి, నీ

యుల్లములోన ఎట్టి పెను ఉప్పెన రేపినవో వచింపవే!

రాగిణి

ఉదయ రవిచంద్రిక : ఝుంపి

తలుపు తట్టని పిలుపు
పెదవి వదలని తలపు.
మలుపు తిరుగని వలపు
మొగ్గకన్నెకు సిగ్గు గొలుపు

చాపు

గుండె తలుపుల గడియ తీసి
విడువ చలపని గడప వదలీ
ఎడద తడబడ నడువ జొచ్చితి
ఒడలు తెలియక వెడలి వచ్చితి

రాధ

శ్యామ

కొండ దాటీ కోన దాటీ
ఏటి గట్టున పుట్ట దాటీ
మంచె కంచె దాటీ
మనసు గీచిన గీటు దాటీ
అడుగు తడబడ నడువజొచ్చితి
ఒడలు తెలియక వెడలివచ్చితి

రాగిణి

రారు కేశి

కలతనిద్దుర గనిన కలలో
చూచినట్లుగ తోచుచుండిన
వెలుగు నీడలు వెల్లివిరిసిన

తరిపి వెన్నెలదారిబట్టి ||ఎడద||
ఎడద తడబడ నడువజొచ్చితి
ఒడలు తెలియక వెడలివచ్చితి

రాధ

హంసనాదం

నింగి మబ్బుల తొంగిచూచుచు
మందలించిన చందమామకు
కన్ను దోయిని కలువ పువ్వుల
కలికి నవ్వులు కాన్క వెట్టి
ఝుంకరించెడి మంకు తుమ్మెద
కన్నె పువ్వుల కౌగిలింతల
అధరమందలి మధువు గ్రోలీ
నిదుర చెందిన పొదలు దాటి
పసిడి వెన్నెలవాక లోనా
ఇసుక తిన్నెల నౌక పైనా
అడుగుజాడల నడువ జొచ్చితి
ఒడలు తూలగ బడలి వచ్చితి.

రాధ, రాగిణి నిష్క్రమణ

రాగిణి పునఃప్రవేశము

దేష్ (తిలకామోడ్)

నా హృదియే యమునానది యైనది
యౌవనమే బృందావని యైనది.
చిరుగాలికి నీ శిరసున ఆడుచు
తళుకులు బెళుకులు కులికెడు పింఛము
నా హృదయమ్మున నాట్యము చేయును,

పెనుపురి విప్పిన కనుపేదురు రా ||నా హృదియే॥

నా హృది మెదలెడి మృదు కలరవమే
నామది కలచెడి నునుకలవరమే
నీ పెదవులపై నినదించెడి ఆ
పిల్లన గ్రోవిని వినిపించునురా ||నా హృదియే॥

రెక్కలు మొలిచిన కమ్మని కలలను
చుక్కలపై విహరింపగ విసరుచు
కలిపితి నా తొలి వలపుల పరిమళ
సౌందర్యమ్ములు బృందావనిలో ||నా హృదియే॥

రాగిణి నిష్క్రమణము

రాధ పునఃప్రవేశము

రీతిగౌళ : చాపు

రారా! సంగీత రసికాగ్రణి !
కారా! శృంగార రసరాస్మణి |
రారా! బృందావన విహారా !
రారా! మురళీ గానలోలా !
రారా! నృత్య విలోల రారా !
ఆర్ద్రహృదయ విహార రారా
కపటనాటక సూత్రధారీ !
రారా! సంగీత రసికాగ్రణి !
రారా! శృంగార రసరాన్మణి !

హమీర్ కల్యాణి

మంజు మంజుల మధుర మంజీ

ర మణి నూపురకింకిణీ రవ
రాగరంజిత రాధికా మృదు
చరణ చారణ చక్రవర్తీ!
రార! సంగీత రసికాగ్రణి !
రార! శృంగార రసరాన్మణి !

రాగిణి ప్రవేశము

ఝుంఝూటి

చల్లని వెన్నెలల్ దశదిశల్ పులకింపగ జేసి లేత జా
బిల్లి వెలుంగులన్ నెమలి పింఛము రంగుల ఇంగిలీకమై
నల్లని మేనికాంతి యమునాసలిలాలకు వన్నెవెట్టగన్
పిల్లనగ్రోవి నూది వినిపింపుము మోహనరాగ మాధురుల్.

తెరలో మురళీరవము

రాధ

భాగేశ్వరి

ఈ దయనీయ నేల కరుణింపవు? ఈ మలిసంజవెల్గులో
ఊదకుమోయి ని మురళి, ఊదిన నోర్వని లేత గుండెకున్
నీ దరహాసచంద్రిక అనిర్వచనీయ మనోజ్ఞ మాధురీ
వేదన తెచ్చిపెట్టు స్థిరవిద్యుదపాంగ విశాల వీక్షణా !

తెరలో మురళీరావము ఆగిపోవును.

రాగిణి ఆసీనయైయుండ, రాధ నిల్చొనియుండును

రాగిణి

ఆఠాణ

చాలు స్పర్శసుఖమ్ము గోపాలకృష్ణ !
మౌళి నెమలి పింఛము జగా మరులు గొలుప

పెదవి పిల్లన గ్రోవితో కదలి వచ్చి
సరస సలాప వాల్లభ్య సౌఖ్య మిమ్ము.

శ్రీకృష్ణుడు ప్రవేశించి రాగిణి కన్నులు మూసి రాధను ముద్దిడి నిష్క్రమించును.

రాగిణి కన్నులు నులుపుకొనుచు లేచి ఆనందతన్మయత్వముతో నృత్య మొనర్చును.

రాగిణి

బిల్హారి

మురళి మ్రోగించి ఆ జగన్మోహనుండు
నెచ్చెలీ! చూచినావుగా వచ్చి యెట్లు
నన్ను లాలించి పోయెనో కన్నుమూసి ;
అవని నాకంటె ధన్యురా లెవతె గలదు?

రాధ

మధ్యమావతి

మురిసిపోవుచునుంటివో ముద్దరాల!
ఎందుకై కనుల్ మూసెనో ఎరుగగలవె?
ఏల పిందెతో పండు వాదింపవలయు ?
ఎవరి అనుభూతి వారె గ్రహింపవచ్చు.

రాధ ఆటు, రాగిణి ఇటు నిష్క్రమించుచుండగ

కలగనుచున్నద హెూ !..
తియ్యని కలగనుచున్నద హెూ !
అలలే కలలై కలలే అలలై
జలజల పారే అల యమునా నది
కల గనుచున్నద హెూ